క్లుప్తంగా

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): విజయ పాల డెయిరీలో తొలగించిన 9 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ పి.కోటేశ్వరరావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న విజయ పాల డెయిరీలో 9 మందిని తొలగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రభాకరరెడ్డి, ఉసేన్‌బాషా, రంగప్ప పాల్గొన్నారు.

12న 'ఘంటసాల నాటకం'

కర్నూలు కల్చరల్: ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఈ నెల 12వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో సురభి కళాకారులచే 'ఘంటసాల నాటకం' ప్రదర్శిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన భాస్కరుని సత్య జగదీశ్ నాటకానికి రచన, దర్శకత్వం వహించారని పేర్కొన్నారు. కళాభిమానులు అందరూ పాల్గొని వచ్చని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ముద్రణాలయం తనిఖీ

కర్నూలు: ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్, సీనియర్ ఐపీఎస్ అధికారి అనురాధ భర్త సురేంద్రబాబుతో కలసి బుధవారం కర్నూలుకు వచ్చారు. కొత్తపేటలోని ప్రభుత్వ ముద్రణాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. బి.క్యాంప్‌లోని పోలీసు అతిథిగృహంలో ఆమెను కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మర్యాదపూర్వకంగా కలిశారు.

10న సీపీఐ నిరసన

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో ఏపీకి జరిగిన అన్యాయంపై ఈ నెల 10వ తేదీన అన్ని పట్టణ, మండల కేంద్రాలతోపాటు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బుధవారం ఓ ప్రకటనలో పార్టీ శ్రేణులను ఆదేశించారు. ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ లేకపోవడం, పోలవరానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించలేదన్నారు.

సెలవుల్లో కమిషనర్

కర్నూలు (టౌన్): విజయవాడలో అధికారిక, వ్యక్తిగత పనుల దృష్ట్యా నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ గురు, శుక్రవారాలు రెండు రోజుల పాటు సెలవు పెట్టారు. అయితే రెండవ శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో కమిషనర్ నాలుగు రోజులు అందుబాటులో ఉండరు. తిరిగి సోమవారం అందుబాటులోకి వస్తారని నగరపాలక కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. పాలన పరంగా ఇబ్బందులు లేకుండా నాలుగు రోజుల పాటు నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రామలింగేశ్వర్ వ్యవహరిస్తారని తెలిపారు.

ప్రతి హామీనీ నెరవేర్చాలి

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఓంకార్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీపీఎస్ రద్దు హామీ అమలుపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, ఉద్యోగ,ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు. జూలై 2023 నుంచి నూతన పీఆర్‌సీకి కమీషన్ వేయాలని ఆయక కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వై.నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డున పడేయడం తగదు'

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగాలు కోల్పోయిన 107 మంది 314 రోజులుగా ఆందోళనలు, ఆవేదనలు వ్యక్తం చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం బాధాకరమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట తొలగించిన ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాదాపు 20 ఏళ్లుగా పనిచేయించుకొని రోడ్డున పడేయడం తగదన్నారు. విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో మనోహర్‌మాణిక్యం, రామాంజనేయులు, లక్ష్మన్న, వేణుగోపాల్, పోలయ్య, శీను, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మైఖేల్, వారసుడు, రైటర్ పద్మభూషన్, బుట్ట బొమ్మ
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, మైఖేల్, వాల్తేరు వీరయ్య, వారసుడు,సువర్ణ సుందరి, రైటర్ పద్మభూషన్, బుట్ట బొమ్మ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, మైఖేల్, రైటర్ పద్మ భూషన్, బుట్ట బొమ్మ
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, ది ఉమన్ కింగ్, రైటర్ పద్మభూషన్, రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం,పఠాన్, సువర్ణ సుందరి
భరత్ కాంప్లెక్స్ : రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం, పఠాన్, సువర్ణ సుందరి
రాజ్ : తెగింపు, బుట్ట బొమ్మ
శ్రీరామ : ప్రేమదేశం
విజయ : పఠాన్

ఆటలకు అందలం

- జిల్లాలో క్రీడాభివృద్ధికి 'శాప్' ప్రత్యేక చొరవ
- నిధుల మంజూరుతోపాటు పరిపాలన అనుమతులు జారీ
- కర్నూలులో బాస్కెట్‌బాల్, మూడు సింథటిక్ టెన్నిస్ కోర్టుల నిర్మాణం
- నంద్యాలలో నాలుగు సింథటిక్, రెండు మట్టి కోర్టులు
- నందికొట్కూర్, పగిడ్యాల, ఆళ్లగడ్డలో ఇండోర్ స్టేడియాల ఏర్పాటు


నందికొట్కూరులో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల దృశ్యం

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత క్రీడలకు మంచి రోజులు వచ్చాయి. గతంలో నామమాత్రంగా ఉన్న శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ప్రస్తుతం కీలకంగా వ్యవహరిస్తోంది. నూతన క్రీడా పాలసీ అమలులోకి వచ్చిన తరువాత జిల్లాలో పెద్ద సంఖ్యలో క్రీడల నిర్వహణ జరుగుతోంది. ఆటలతోకు అగ్ర పాధాన్యత ఇస్తూనే క్రీడాకారులకు పూర్తి సహాయ, సహకారం అందిస్తోంది. వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు, స్పోర్ట్సు క్లబ్స్, ఏపీ సీఎం కప్, జగనన్న క్రీడా సంబరాలు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు జిల్లా వ్యాప్తంగా అనేక నియోజకవర్గ కేంద్రాల్లో స్టేడియాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి చొరవతో కర్నూలు ఉమ్మడి జిల్లాలో క్రీడలకు సంబంధించిన అభివృద్ధి పనులు, యువత, విద్యార్థులు క్రీడల వైపు దృష్టి సారించేలా ఎన్నో చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల క్రితం శాప్ బోర్డు మీటింగ్‌లో జిల్లాలో క్రీడల అభివృద్ధికి సంబంధించి నిధుల మంజూరు చేయడంతోపాటు పరిపాలన అనుమతులు జారీ చేశారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ఆధునీకీకరణ:
జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టు చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. సిమెంటు దెబ్బతినడంతో క్రీడాకారులకు చిన్నపాటి గాయాలు అవుతున్నాయి. దీన్ని ఆధునీకరించాలని గతంలో ఎన్నో విన్నపాలు వచ్చాయి. అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా ప్రభుత్వం బాస్కెట్ బాల్ కోర్టును జాతీయ స్థాయి ప్రమాణాలతో రూ.61 లక్షలు వెచ్చించి పూర్తిగా సింథటిక్ కోర్టుగా మారుస్తోంది. ఇందుకు నిధులు మంజూరు అయ్యాయి. ఇక టెన్నిస్‌కు మంచి ఆదరణ ఉండటం, ఇక్కడ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు ఉన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని వెంకటరమణ కాలనీలో రూ.1.20 కోట్లతో 3 సింథటిక్ టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు.

రూ.6.69 కోట్లతో స్టేడియాల నిర్మాణాలు
కర్నూలు నగరంతో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇండోర్ స్టేడియాల నిర్మాణాలు చేపట్టేందుకు శాప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు నిధులు మంజూరు చేసింది. దీంతో నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 4 సింథటిక్ కోర్టులు, 2 మట్టి టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రూ.2 కోట్లు మంజూరు చేశారు. అలాగే నందికొట్కూర్, పగిడ్యాలలో ఒక్కోదానికి రూ.1.20 కోట్ల చొప్పున 2 ఇండోర్ స్టేడియాలు నిర్మిస్తున్నారు. పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. వచ్చే నెల మార్చి నెలాఖరులోపు ఈ పనులు పూర్తి కావచ్చని స్పోర్ట్స్ అధికారులు తెలిపారు. నందికొట్కూర్ పట్టణంలో రూ.10 లక్షలు వెచ్చించి ఫ్లడ్‌లైట్ల సౌకర్యాలతో వాలీబాల్ కోర్టు నిర్మించనున్నారు. అలాగే ఆళ్లగడ్డ పట్టణంలో రూ.1.20 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టనున్నారు. కర్నూలు, నంద్యాల, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, శిల్పా రవి చంద్రారెడ్డి, గంగుల బిజేంద్రరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో పాటు స్థానికంగా క్రీడా సంఘాలు కోరడంతో శాప్ ప్రత్యేకంగా దృష్టి సారించి వీటన్నింటికీ నిధులు కేటాయించడమే కాకుండా అధికారికంగా పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

త్వరలో పనులు ప్రారంభం



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లాలో క్రీడలకు, క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో ఇండోర్ స్టేడియాల నిర్మాణాలు చేపట్టేందుకు అన్ని అనుమతులు ఇచ్చింది. ఇది క్రీడాకారులకు ఎంతో ఊరట ఇస్తుంది. క్రీడారంగంలో జిల్లా మరింత ముందు స్థానంలో నిలబడేందుకు అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాకు వచ్చిన శాప్ నిధులతో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా టెండర్లు నిర్వహించి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తాం.
– రమణ, సీఈఓ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ


జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ పరిధి 35వ వార్డు పరిధిలోని భగవాన్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో వృద్ధులు, మహిళలు, ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే తాము గడప గడపకు వస్తున్నామన్నారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. కాలనీకి చెందిన మహిళలు పలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య, పలువురు కార్పొరేటర్లు, ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, వార్డులోని స్థానిక నాయకులు ఎం.సుధాకర్‌రెడ్డి, సుభాన్, శివారెడ్డి, షకీల్, వలి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని రిక్షా కార్మికుడు ఆత్మహత్య

కర్నూలు: కోడుమూరు రోడ్డులోని పెద్దపాడు సమీపంలో ఉన్న రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న సజీవరాజు (46) గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన రిక్షా తొక్కుతూ జీవనం సాగించేవాడు. మహారాష్ట్రలోని థానే జిల్లా శివాజీనగర్‌కు చెందిన లీలావతితో 15 ఏళ్ల క్రితం పెళ్లి అయింది. వీరికి ముగ్గురు సంతానం. పెళ్లి అయిన కొంతకాలం నుంచే భార్య ఊరిలోనే రిక్షా తొక్కుతూ జీవనం సాగించేవాడు. కరోనా సమయంలో కర్నూలుకు వచ్చాడు. భార్య తన పిల్లలతో పుట్టింటిలోనే ఉండేది. సజీవరాజు రాజీవ్ గృహకల్పలోనే ఓ గదిలో ఒంటరిగా ఉండేవాడు. అనారోగ్యం తాళలేక బుధవారం ఉదయం గదిలో తాడుతో ఉరి వేసుకున్నాడు. బంధువులు కనుగొని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

- ఆర్డీఓ హరిప్రసాద్
- రూపాల సంగమేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్


హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): శ్రీ ఉమాసమేత రూపాల సంగమేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. బుధవారం ఆర్డీఓ తన కార్యాలయంలో రూపాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దిన్నెదేవరపాడు గ్రామ సమీపంలోని జగన్నాథగట్టుపై వెలసిన శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు కర్నూలు నగరం నుంచి వేలాది మంది తరలి రానుండడంతో ముందస్తుగా ఏర్పాట్లు చేయడంపై అధికారులు దృష్టిసారించాలన్నారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ నుంచి దేవస్థానం వరకు, బి.తాండ్రపాడు నుంచి దేవస్థానం వరకు ఉన్న రహదారుల్లో గుంతలను పూడ్చాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, లైటింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు, భక్తులకు తాగునీరు, దేవస్థానానికి వచ్చే రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అత్యవసరంగా వైద్యం అవసరమైతే చర్యలు తీసుకోవాలని, 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని వైద్యా ఆరోగ్య శాఖకు సూచించారు. 18, 19 తేదీల్లో నిరంతరంగా బస్సులు నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్లకు సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా దేవస్థానం అధికారులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం దేవస్థానం బ్రహ్మోత్సవాల కోసం ముద్రించిన కరపత్రాలను ఆర్డీఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహక అధికారి గుర్రెడ్డి, సెక్రటరీలు కృష్ణన్న, మల్లికార్జునరెడ్డి, కమిటీ సభ్యులు మోక్షేశ్వరుడు, మురళి, సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల సేవలను విస్తరించండి

సి.బెళగల్: సచివాలయ సేవలను మరింత విస్తరించాలని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని సచివాలయాలను అకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తకోట - 1 గ్రామ సచివాలయంలో కార్యాలయ నిర్వహణ తీరును, ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ఉద్యోగుల, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ సందీప్‌ను ఆదేశించారు. అనంతరం కొత్తకోట - 2 (ఈర్లదిన్నె), ముడుమాల సచివాలయాలను తనిఖీ చేసి, మీ పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని, నిర్లక్ష్యం వీడాలని ఉద్యోగులకు హెచ్చరించారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేద ప్రజలకు వరంలాంటిదని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కోడుమూరులో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డా.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరీరక్షణకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. వైద్యులు ఇళ్ల వద్దకే వెళ్లి వారికి వైద్యసేవలు అందించాలన్నారు. లద్దగిరి పీహెచ్‌సీ వైద్యులు సబీహా నస్రీన్, సీహెచ్‌ఓ శాంత తదితరులు పాల్గొన్నారు.

రేపు వేలం పాటలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామం శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ అంగళ్ల నిర్వహణకు ఈ నెల 10 వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రామకృష్ణుడు బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. టెంకాయల, గాజులు, పటాలు, పూల అంగళ్ల నిర్వహణకు ఆసక్తి గల వారు రూ.10 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

వాహనాల వేలం

పాణ్యం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పాణ్యం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వేలం నిర్వహించారు. దీని ద్వారా రూ.2.24 లక్షలు ఆదాయం వచ్చినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సుధాకర్‌రెడ్డి, బీటీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఓర్వకల్లు: ఉపాధి కూలీలకు 11 వారాల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిరీర్యం చేస్తోందని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.30 వేల కోట్లు తగ్గించి ఇవ్వడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించి, ప్రతి ఒక్కరికీ 200 రోజుల పనిదినాలతో పాటు, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నగరాభివృద్ధికి పెద్దపీట

- రూ.117 కోట్లతో శరవేగంగా వివిధ రకాల ప్రగతి పనులు
- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- కల్లూరు అర్బన్ వార్డుల్లో రూ. 1.16 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఆధునికీకరించిన 4 పార్కులు పునఃప్రారంభం


కస్తూరి నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం పార్కును ప్రారంభించిన మేయర్ బి.వై.రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కర్నూలు నగరాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 29, 31,33, 36వ వార్డుల్లో రూ. 1.16 కోట్ల నగర పాలక సాధారణ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు వారు శ్రీకారం చుట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆధునికీకరించిన నాలుగు పార్కులను పునః ప్రారంభించారు. 29వ వార్డు వివేక్‌నగర్ పార్కును రూ. 6 లక్షలతో, కస్తూరినగర్ పార్కును రూ. 8 లక్షలతో, 31వ వార్డు సాయినగర్ పార్కును రూ. 9.70 లక్షలతో, 37వ వార్డు ఆదిత్య నగర్ పార్కును 9.60 అభివృద్ధి చేశారు. అలాగే 36వ వార్డులోని డ్రైవర్స్ కాలనీలో రూ. 33 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు , రాజీవ్ గృహకల్ప కాలనీలో రూ. 50 లక్షలతో అంతర్గత రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మేయర్ రామయ్య మాట్లాడుతూ... మాట్లాడుతూ నగరంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలక వర్గం వచ్చాక నగరంలో రూ. 117 కోట్లతో 757 రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో ఇప్పటికే 388 పనులు దిగ్విజయంగా పూర్తి అయ్యాయని, మిగిలిన పనులు వివిధ దశల్లో సాగుతున్నాయన్నారు. అందరి సహకారంతో ప్రణాళికాయుతంగా నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ...కల్లూరు అర్బన్ పరిధిలో రూ.55 కోట్లతో అనేక రకాల పనులు చేపట్టామన్నారు. అత్యవసర పనులకు తొలిప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మళ్లీ ఓటమి తప్పదనే భయంతో ప్రతిపక్షాలు కుట్ర రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు ఎంఈ షాకీర్, డి.ఈ.ఈ రాజశేఖర్, ఏఈ కృష్ణలత, ఉద్యానశాఖ ఏడీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

'దేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసింది'


భరత మాత ఆలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు

కర్నూలు కల్చరల్: దేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అన్నారు. బుధవారం పాణ్యం నియోజకవర్గంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి రాఘవేంద్ర తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 60 పథకాలను అమలు చేస్తుందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అందరూ పని చేసి పట్టభద్రుల ఎమ్మెల్సీని గెలిపించాలన్నారు. అంతకు ముందు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి, కన్వీనర్ బ్రహ్మాజీ, బీజేవైఎమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరిరెడ్డి, నాయకులు బీసీ వీరప్ప, చైతన్యకుమార్, కొట్టె చెన్నయ్య, నాగరాజు, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం కింద చేపడుతున్న భూసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేను ఆయన తనిఖీ చేశారు. బ్రాహ్మణదొడ్డి గ్రామంలో రెవెన్యూ అధికారులు జాకీర్, గ్రామ సర్వే సహాయకుడు రాజశేఖర్‌కు సర్వేపై పలు సూచనలు చేసి భూ రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ భూముల రీ సర్వేతో భావిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తవన్నారు. మండలంలో ప్రస్తుతం 80 శాతం భూముల రీ సర్వే పూర్తయిందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని శ్రీ సత్య సాయి మందిరంలో నూతనంగా నిర్మించిన శ్రీ సాయిశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సపరివార శివ ప్రతిష్ఠ కార్యక్రమాలను పురస్కరించుకొని బుధవారం మండప పూజలు, ధాన్యాది వాసం జరిగాయి. గురువారం యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠ, బలిదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్ కుమార్ వెల్లడించారు. అధిక సంఖ్యలో భక్తులు, సాయి సేవకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ

- ప్రతి డివిజన్‌కు అధికారుల నియామకం

కర్నూలు (టౌన్): స్వచ్ఛతలో ఇప్పటికే రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచిన నగరపాలక సంస్థను మరింత ముందు వరుసలో నిలిపేందుకు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పారిశుద్ధ్య సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడంతో పాటు వంద శాతం తడి, పొడి చెత్త సేకరించడం, మరింత పకడ్బందీగా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే ప్రతి డివిజన్‌కు ప్రత్యేక అధికారిని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1, 2 డివిజన్లకు సుహేయిల్ 2,4 డివిజన్లకు జునీద్ 4, 7వ డివిజన్లకు రాజు, 3, 11 డివిజన్లకు అబ్దుల్ రసూల్, 10, 11, 8,12 డివిజన్లకు ఇస్మాయిల్, 12,13 డివిజన్లకు క్రిష్టఫర్, 13, 14, 15 డివిజన్లకు అబ్దుల్ వాజిద్, 16,17 డివిజన్లకు మన్సూర్ బాష, 8,16,17 డివిజన్లకు సాధిక్ హుస్సేన్, 8,6,5,9 డివిజన్లకు మన్సూర్ బాష, 1,9 డివిజన్లకు ఖలీల్ రహిమాన్‌లను నియమించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కర్నూలు సిటీ: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకొని, పరిపాలన సౌలభ్యాన్ని అవగతం చేసుకుంటే కేంద్రంలో ఉన్నత సర్వీసు ఉద్యోగాలు తప్పక లభిస్తాయని కర్నూలు డీఎస్పీ కె.వి. మహేష్ అన్నారు. బుధవారం నగర శివారులోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్(కట్టమంచి స్కూల్)లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్కూల్ ఎన్‌సీసీ పరేడ్‌తో పాటు, విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు, వాటి రిపోర్టులను చూసిన డీఎస్పీ విద్యార్థులను అభినందించారు. క్రమ శిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూళ్ల ఏజీఎం కె.వి మహేష్, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, డీన్ పవన్ పాల్గొన్నారు.